

సామూహిక సత్యనారాయణ వ్రతం

నగరం: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.



కేసానుపల్లిలో కవాతు

దాచేపల్లి : కేసానుపల్లిలో బుధవారం పోలీసులు కవాతు నిర్వహించారు. తనిఖీలు చేపట్టారు. ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

అభయాంజనేయునికి అభిషేకాలు



గాజులపేట(భట్టిప్రోలు): పెదపులివర్రు పంచాయతీ గాజులపేటలోని అభయాంజనేయ స్వామి ప్రథమ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా బుధవారం పవిత్ర కృష్ణానదీ జలాలతో అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి హనుమజ్జయంతి మహోత్సవాలు



పొన్నూరు : పట్టణంలోని సహస్ర లింగేశ్వర స్వామి, వీరాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం నుంచి జూన్ 2 వరకు హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. 1వ తేదీ ఉదయం 4 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు, సాయంత్రం 4 గంటలకు లక్ష తమల పాకులు, మల్లెపూలతో పూజ, నివేదన, నీరాజనం, తీర్థప్రసాదాలు పంపిణీ, రాత్రి 7 గంటలకు సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం, 2న సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి దివ్య రథోత్సవం జరుగుతుందని తెలిపారు.

పాతగుంటూరులో హనుమజ్జయంత్యుత్సవాలు



నగరంపాలెం: స్థానిక పాత గుంటూరు ప్రధాన రహదారిలోని విశాఖ శ్రీ శారదాపీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో హనుమత్ జయంతి ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి. బుధవారం 108 మట్టి కుండలతో జాజికాయ జాపత్రి, యాలకులు వంటి 12 రకాల సుగంధ ద్రవ్యాలతో వేద పండితుల మంత్రాలతో సహస్ర ఘట్టాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. రామ నామంతో దేవాలయం మార్మోగింది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, గ్రంధి కోటేశ్వరరావు, ఆత్మకూరి లక్ష్మణరావు, చీమకుర్తి తాండవ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన కామేపల్లి లక్ష్మీప్రసాద్ దంపతులను పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి, సత్కరించారు.

79 అడుగుల అభయాంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: గుంటూరు ఏటుకూరు రోడ్‌లోని సువర్చలా సమేత అభయాంజనేయ స్వామి 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. బుధవారం హనుమత్ రుద్ర పాశుపత హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు మూలవిరాట్‌కు కలశాభిషేకం, నీరాజన, మంత్ర పుష్పం చేపట్టగా, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. సాయంత్రం సుదర్శన హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చే నెల ఒకటి వరకు ప్రపంచ శాంతి సకల జనుల శ్రేయస్సు, లోక కల్యాణార్థం బ్రహ్మశ్రీ రాజకుమార్ శర్మ అర్చకత్వంలో అంగరంగ వైభవంగా ప్రారంభించినట్లు ఆలయ పాలక మండలి నిర్వాహకులు తెలిపారు.

మైనార్టీ బాలికల పాఠశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పొన్నూరు రోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహిస్తున్న ఏపీఆర్ మైనార్టీ బాలికల పాఠశాలలో 5,6,7,8 తరగతుల్లో ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ. బాలాశ్రీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ముస్లిం, మైనార్టీ విద్యార్థినులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు పొన్నూరు రోడ్డులో సంగడిగుంట వద్ద ఉన్న పాఠశాలలో జూన్ 12వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్ పొందవచ్చునని తెలిపారు. వివరాలకు 87126 25039, 63020 18886 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అభివృద్ధికి అభినందనం

- రెండు కొండల మధ్య టెంపుల్ హిల్ ఎకో పార్క్
- సుమనోహరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం
- వాకింగ్ ట్రాక్, టెక్కింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ సదుపాయాలు
- పిల్లల కోసం ఆట వస్తువులు, పరికరాలూ అందుబాటులో..
- సుదూరప్రాంతాల నుంచి తరలివస్తున్న పర్యాటకులు
- హుషారుగా ట్రెక్కింగ్ చేస్తున్న యువకులు



పచ్చదనంతో కళకళలాడుతున్న టెంపుల్ హిల్ ఎకో పార్కు

మంగళగిరి: ప్రకృతి పరువాలు పరుచుకున్నట్లు.. రెండు కొండల మధ్య కొలువైన సుమనోహర ప్రాంతం.. పచ్చలహారాలు ధగధగలాడుతున్నట్లు అపురూప వృక్ష సంపదకు ఆలవాలమైన సుందర వనం.. సుస్వరాలేవో చెవులను సుతారంగా తాకుతున్నట్లు.. చల్లని పవనాలతో జతకట్టి కిలకిలారావాలు చేసే పక్షి జాతుల సమాహారం.. అడుగడుగునా ఆహ్లాదం పంచే వాతావరణం.. అబ్బురపరిచే ఆలయాల రమణీయం.. ఇవన్నీ మంగళగిరిలో కొలువైన టెంపుల్ హిల్ ఎకో పార్కు ప్రత్యేకతలు. ఈ ఉద్యానవనం సందర్శకులను సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతోంది. పిల్లలను, పెద్దలను ఆనంద డోలికల్లో ఓలలాడిస్తోంది.



పార్కులో వాకింగ్ ట్రాక్

ఎమ్మెల్యే ఆర్కే కృషి ఫలితమే..

మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యం.. ఆనందం అందించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దృష్టి సారించారు. వెంటనే అటవీశాఖ అధికారులతో మాట్లాడి ఎయిమ్స్ ఆస్పత్రి పక్కన రెండు కొండల మధ్య అందంగా పచ్చదనం పరుచుకున్న నగర వనం(టెంపుల్ హిల్ ఎకో పార్కు) అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం వెంటనే స్పందించడంతో రూ.60 లక్షలతో పార్కును అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, యోగా చేసే వారికి ప్రత్యేకంగా రెళ్లగడితో వేసిన గుడారాలు, షటిల్ కోర్టులు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ఆట వస్తువులు పరికరాలు సమకూర్చారు. నక్షత్ర, నవగ్రహ, పంచవటిల పేర్లతో ఔషధ మొక్కలతో కూడిన సుమనోహర రాశి వనాలను ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి గాంచిన పానకాల లక్ష్మీనృసింహస్వామి, గండాలయస్వామి కొండ ఆనుకుని దిగువన 50 ఎకరాలలో ఈ నగర వనాన్ని తీర్చిదిద్దారు. ప్రస్తుతం వేసవి కావడంతో పార్కుకు సందర్శకులు పోటెత్తుతున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో వృద్ధులు, యువకులు, వాకింగ్ చేసే వారు బారులు తీరుతున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా ట్రెక్కింగ్ ట్రాక్



టెక్కింగ్ కోసం విచ్చేసిన విజయవాడ యువకులు

పార్కు నుంచి గండాలయ స్వామి కొండపైకి రెండు కిలోమీటర్ల మేర నిర్మాణం చేసిన ట్రెక్కింగ్ ట్రాక్ యువతను ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది. మంగళగిరి–తాడేపల్లి నుంచే కాక విజయవాడ, గుంటూరు నగరాల నుంచి అనేక కళాశాలలు, విద్యా సంస్థల నుంచి విద్యార్థులు, యువత ప్రత్యేకంగా తరలివచ్చి ట్రెక్కింగ్‌లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి వల్లే ఈ పార్కు సకల హంగులతో రూపుదిద్దుకుందని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, నగర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువకులు

ట్రెక్కింగ్ ట్రాక్ చాలా బాగుంది



రెండు కొండల మధ్య పచ్చని ఆహ్లాదకర వాతావరణంలో ట్రెక్కింగ్ ట్రాక్ చాలా బాగుంది. విజయవాడలో ఎక్కడా ఇలాంటి వాతావరణం ఉన్న పార్కు లేదు. ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారా గండాలయస్వామి కొండకు చేరుకుని స్వామిని దర్శించుకోవడం సంతోషాన్నిచ్చింది. మరింత ప్రచారం నిర్వహిస్తే మంగళగిరి కొండ ప్రాంతం ఆధ్యాత్మికతతోపాటు పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. – వెంకట్, విజయవాడ

మంచి పర్యాటక ప్రాంతం



టెంపుల్ హిల్ ఎకో పార్కుకు వస్తే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. ఇక్కడ పచ్చదనంతో కూడిన వాతావరణం కట్టిపడేస్తోంది. రోజూ పార్కును సందర్శిస్తే ఇక్కడి ఔషధ మొక్కల వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వారానికి రెండు మూడు సార్లు అయినా విజయవాడ నుంచి స్నేహితులతో సందర్శిస్తాం. ట్రెక్కింగ్ ట్రాక్ కూడా చాలా బాగుంది. సమీప నగరాల వాసులకు ఇదో మంచి పర్యాటక ప్రాంతం. –విఘ్నేష్, విజయవాడ

మూడుసార్లు ట్రెక్కింగ్ చేశా



స్నేహితులతో పార్కును సందర్శించి కొండపైకి ట్రెక్కింగ్ ట్రాక్ ద్వారా చేరుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటికే మూడు సార్లు ట్రెక్కింగ్‌లో పాల్గొన్నా. పచ్చదనంతో కూడిన పార్కు పెద్దలను, పిల్లలను ఆకట్టుకుంటుంది. పార్కుకు ప్రాచుర్యం కల్పిస్తే పర్యాటకులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. – సుధాకర్, విజయవాడ

కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ కౌంటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం న్యూఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి సీనియర్ డెప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, ఎస్పీ తుషార్ డూడీ, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతుందని, అసెంబ్లీతోపాటు పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్‌కు వేర్వేరుగా 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు, నెట్ కనెక్షన్, బారికేడ్లు, కంట్రోల్ రూమ్ తదితర ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతోపాటు వారి తరఫు ప్రతినిధులు కంట్రోల్ రూమ్ నుంచి పరిశీలించుకునే అవకాశం కల్పించామన్నారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈ నెల 27, 28 తేదీల్లో రెండు దఫాల్లో శిక్షణ పూర్తి చేశామన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి కౌంటింగ్‌పై అవగాహన కల్పించామన్నారు. కౌంటింగ్ ముందు రోజు నుంచి 144 సెక్షన్ అమలుతోపాటు మద్యం దుకాణాల మూసివేతకు ఆదేశాలిచ్చామని తెలిపారు.

పటిష్ట భద్రత : ఎస్పీ

ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రాంతంలో ఇప్పటికే మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. సీసీ, బాడీవేర్ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా ప్రతి క్షణం పర్యవేక్షిస్తామన్నారు. 185 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని పేర్కొన్నారు. 150 పికెటింగ్ పాయింట్లు, 75 మొబైల్ పార్టీలు, 28 క్విక్ రియాక్షన్ బృందాలు, 8 స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రధాన పార్టీల కార్యాలయాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు.

ఇసుక తవ్వకాలపై నిఘా

- ఎన్జీటీ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు
- ఇసుక అక్రమ రవాణానూ ఉపేక్షించేది లేదు
- ఇసుక రీచ్‌ల్లో ప్రత్యేక బృందాలతో 24 గంటల నిఘా
- ప్రభుత్వ శాఖల అధికారుల నిరంతర పెట్రోలింగ్
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



ఇసుక రీచ్‌లో అధికారులతో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ డూడీ

తెనాలి: జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకు అవసరమైన చర్యల్ని పకడ్బందీగా చేపట్టాలని స్పష్టంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కలెక్టర్ బుధవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లాస్థాయి ఇసుక కమిటీ సభ్యులతో కలిసి కొల్లిపర, తాడేపల్లి మండలాల్లోని ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. తొలుత కొల్లిపర మండల గ్రామం బొమ్మువానిపాలెం 14,15 ఇసుక రీచ్‌లను పరిశీలించారు. అనంతరం మున్నంగి, తాడేపల్లి మండలంలోని గుండెమెడ ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు. 24 గంటల నిఘా కోసం రీచ్‌ల్లో రెండు షిఫ్టులుగా నియమించిన బృందాల్లోని సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణా జరక్కుండా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు జరగకూడదని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన పరిధిలోనే మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరిగేలా మైనింగ్ అధికారులతోపాటు పోలీస్, రెవెన్యూ, శాండ్ కమిటీలోని ఇతర శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, మైనింగ్, ఇతర శాఖల అధికారులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్టు గుర్తించినట్టయితే వెంటనే పోలీస్ అధికారులు కేసులు నమోదుచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటు చేసిన కమిటీ అయినందున సభ్యులందరూ అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, నిబంధనలను అతిక్రమించకుండా చూడాలని ఆయన సూచించారు. అక్రమ ఇసుక తవ్వకాలపై వచ్చే ఫిర్యాదుల్ని కూడా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, జిల్లాస్థాయి ఇసుక కమిటీ కన్వీనర్, మైనింగ్‌శాఖ డీడీ చంద్రశేఖర్, జిల్లా ఎస్ఈబీ అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, భూగర్భ జలవనరులశాఖ డెప్యూటీ డైరెక్టర్ వందనం, ఎన్విరాన్మెంట్ ఇంజినీరు నారాయణ, జిల్లా ఉపరవాణా కమిషనర్ కరీం, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కల్యాణ చక్రవర్తి, రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

- 30,788 మెట్రిక్ టన్నులు సిద్ధం
- ఆర్‌బీకేలు, సొసైటీలకు మొదటి ప్రాధాన్యం
- ఖరీఫ్‌కు ముందస్తుగా అన్ని రకాలూ సరఫరా
- వచ్చే ఖరీఫ్, రబీ సీజన్‌లకు 1.90 లక్షల మెట్రిక్ టన్నులతో ప్రణాళిక



గిడ్డంగిలో నిల్వ చేసిన ఎరువులు

కొరిటెపాడు(గుంటూరు): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచింది. ఎరువుల సమస్య ఉత్పన్నం కాకుండా వ్యవసాయ, మార్క్‌ఫెడ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వివిధ కంపెనీల ద్వారా వచ్చిన ఎరువులను మొదటి ప్రాధాన్యంగా రైతు భరోసా కేంద్రాలు(ఆర్‌బీకే), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)కు సరఫరా చేస్తున్నారు. మిగతావి హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు అందించడంతోపాటు గిడ్డంగులు, కంపెనీ గోదాముల్లో నిల్వ చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం..

మండలాలు, గ్రామాల వారీగా వరి, పత్తి, మినుము వంటి వ్యవసాయ, మిరప, పొగాకు, అరటి, కూరగాయలు, మామిడి లాంటి ఉద్యాన పంటల విస్తీర్ణం, వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని తగినంత ఎరువుల సరఫరా, నిల్వలకు ముందస్తు ప్రణాళిక రూపొందించి కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. జూన్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్న 2024–25 ఖరీఫ్, ఆ తర్వాత రబీ సీజన్‌లకు అవసరమైన 1.90 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులకు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపగా ఇటీవలే అనుమతులు లభించాయని పేర్కొన్నారు. రైతులకు గ్రామాల్లోనే ఎరువులు లభించేలా ఆర్‌బీకేలు, సొసైటీలకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. ఎంఎస్‌పీకి మించి అమ్మకుండా, అలాగే డీబీటీ పద్ధతి (ఆన్‌లైన్ విధానం)లోనే క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

30,788 మెట్రిక్ టన్నులు..

జిల్లా వ్యాప్తంగా 30,788 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. అందులో కాంప్లెక్స్ ఎరువులు అత్యధికంగా 14,467 మెట్రిక్ టన్నులు, యూరియా 12,360 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,167 మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాస్(ఎంఓపీ) 794 మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో వేర్ హౌస్‌లలో 15 వేల మెట్రిక్ టన్నులు, హోల్‌సేల్ డీలర్ల వద్ద 10 వేల మెట్రిక్ టన్నులు, ఆర్‌బీకేల్లో 3 వేల మెట్రిక్ టన్నులు, సొసైటీల్లో 2,788 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

మాక్.. జనం అవాక్కు

క్రోసూరులో పోలీసుల విన్యాసాలు

స్థలం : క్రోసూరు అమరావతి బస్టాండ్

సమయం : సాయంత్రం 4 గంటలు



మాక్ డ్రిల్‌లో భాగంగా ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

క్రోసూరు: ఒక్కసారిగా 50 మందిపైగా ఆందోళనకారులు ప్లకార్డులతో 'పోలీసులు డౌన్‌డౌన్' అంటూ నినదించారు. రాళ్లను రోడ్డుపై విసిరారు. టైర్లు తగులపెట్టి భీతావహ వాతావరణం సృష్టించారు. దీంతో క్రోసూరు వాసులు ఉలిక్కిపడ్డారు. కొద్దిసేపటికే సీఐ మంగారావు, ఎస్ఐ షఫీ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టే యత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో సీఐ పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆర్మ్‌డ్ డీఎస్పీ గాంధీ రెడ్డి, ఆక్టోపస్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్మ్‌డ్, సివిల్, దళాలు ప్రత్యేక పోలీసు వ్యాన్లలో ఘటనాస్థలానికి చేరాయి. అయినా ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ప్లాస్టిక్ బులెట్స్ ఫైర్ చేసి హెచ్చరించారు. ఓ ఆందోళనకారుడు తీవ్రగాయాలతో రక్తమోడుతూ పడిపోయాడు. వెంటనే పోలీసు సిబ్బంది అతడిని ప్రత్యేక వాహనంలో తరలించారు. అంబులెన్సుల హడావుడి, పోలీసు సైరన్లతో గందరగోళం నెలకొంది. ఎట్టకేలకు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పోలీసులు వాహనాల్లో తరలించారు. ఈ దృశ్యాలన్నింటినీ ఖిన్నులై చూస్తున్న ప్రజలకు ఇది ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా చేసిన మాక్ డ్రిల్ అని ఓ మైక్ ఎనౌన్స్‌మెంట్ వచ్చింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకున్న పోలీసులు



మంగళగిరి : గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ వద్ద అక్రమంగా తరలిస్తున్న ఆవుల కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ వెంకటరావు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ నుంచి చెన్నైకు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించగా 60 ఆవులతో వెళ్తున్న కంటైనర్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కంటైనర్‌లోని ఆవులను గుంటూరు వద్ద వెంగళాయపాలెంలో గల గోసరంక్షణ కేంద్రానికి తరలించి అప్పగించామన్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 221 మంది హాజరు

నేడు 43,001 నుంచి 59 వేలు ర్యాంకు వరకు పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ బుధవారం సాయంత్రం 7 గంటల వరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 221 మంది విద్యార్థులు హాజరైనట్లు హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. గురువారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 43,001 నుంచి 59 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.



క్లుప్తంగా

రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు

కొలనుకొండ గేటు తాత్కాలికంగా మూసివేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి కృష్ణా కెనాల్ పరిధిలోని కొలనుకొండ- పెదవడ్లపూడి మధ్య రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు చేపట్టడంతో తాత్కాలికంగా కొలనుకొండ రైల్వేగేటును మూసివేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 31వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 2వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటును మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి రాకపోకలు చేసేవారు ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లాలని రైల్వే అధికారులు సూచించారు. ఇప్పటికే రైల్వేగేటు మూసివేతపై తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంతో పాటు పోలీస్ స్టేషన్‌కు కూడా సమాచారం అందించినట్లు వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

తాడికొండ: బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల ప్రకారం.. లాం గ్రామానికి చెందిన రాయపూడి గురవయ్య అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలపై అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందికి గురి చేస్తున్నాడు. బాలికలు విషయాన్ని కుటుంబ సభ్యుల దృష్టికి రాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



సత్తెనపల్లి: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని అచ్చంపేట రైల్వే గేటు సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన నల్లబోతు పూర్ణ చంద్రశేఖర వర ప్రసాద్ (32) తెలంగాణ రాష్ట్రంలో బార్ అండ్ రెస్టారెంట్ కౌంటర్‌లో పని చేస్తున్నాడు. మృతుడి సోదరుడు ప్రకాశం జిల్లా ముండ్లమూడు గ్రామంలో నర్సరీ సాగు చేస్తుండగా రెండు నెలల కిందట అక్కడికి వచ్చి ఉంటున్నాడు. రెండు రోజుల కిందట స్వగ్రామమైన నందిగామ వచ్చాడు. మద్యం తాగిన మత్తులో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి జిల్లాలో ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటు



ప్రతిభ కనపరచిన కెడెట్లను మెడల్స్‌తో సత్కరిస్తున్న వి.ఎం.రెడ్డి



నంబూరు వీవీఐటీలో కెడెట్ల ప్రదర్శనలు

డెప్యూటీ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కొమోడోర్ వి.ఎం.రెడ్డి

పెదకాకాని: ప్రతి జిల్లాలో యూనిట్లను ఏర్పాటుచేసి ఎన్‌సీసీని అందరికీ చేరువ చేస్తామని ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డెప్యూటీ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కొమోడోర్ వి.ఎం.రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నిర్వహిస్తున్న 10ఎ బెటాలియన్ బాలికల వార్షిక శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ ఎన్‌సీసీ అందుబాటులో లేని ప్రాంతాల్లో దాని అవశ్యకతను తెలియపరచి యూనిట్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో 70 యూనిట్ల ద్వారా శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన కేడెట్లను ఢిల్లీలో నిర్వహించు తలసైనిక్ క్యాంప్‌నకు పంపుతామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం నుంచి వార్షిక శిక్షణ శిబిరంలో సాహస విన్యాసాలైన రాక్ క్లైంబింగ్, ట్రెక్కింగ్, కైయాకింగ్ కూడా ప్రవేశ పెట్టామని తద్వారా కేడెట్లు పూర్తిస్థాయి ప్రావీణ్యం పొందగలుగుతారని ఆయన వివరించారు. కేంద్ర ప్రభుత్వం మొదటి దశలో 26వేల ఎన్‌సీసీ పోస్టుల భర్తీకి అనుమతి తెలిపిందని వెల్లడించారు. అనంతరం శిబిరంలో ప్రతిభ కనబరచిన కేడెట్లకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్. సుదర్శన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి మేజర్ అవినాష్ పట్వాల్, వీవీఐటీ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ ఎ. శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌యూకు జాతీయ ర్యాంక్



ర్యాంక్ వచ్చినట్లు తెలియజేస్తున్న వీసీ రాజశేఖర్ తదితరులు

పెదకాకాని(ఏఎన్‌యూ): రాష్ట్రంలో అతిపెద్ద విశ్వ విద్యాలయాల సరసన నిలుస్తున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధి చెందుతూ ప్రత్యేకతను చాటుకుంటోంది. మరోసారి జాతీయ స్థాయిలో ఉనికిని చాటుకుని మెరిసింది. ది వీక్ - హన్సా రీసెర్చ్ - బెస్ట్ యూనివర్సిటీ సర్వే - 2024 ర్యాంకింగ్స్‌లో మల్టీడిసిప్లినరీ యూనివర్సిటీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 16వ ర్యాంకును, రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకును కైవసం చేసుకుందని బుధవారం వీసీ ఆచార్య పట్టేటి రాజశేఖర్ పేర్కొన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇంటెలెక్చ్యువల్ రిసోర్సెస్ - ఫాకల్టీ, రీసెర్చ్, అకాడమిక్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్ అడ్మిషన్స్, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్, ఎక్స్‌ట్రా కర్రీక్యులర్ యాక్టివిటీస్, ప్లేస్మెంట్స్ ఆధారంగా ద వీక్ హన్సా రీసెర్చ్ ర్యాంకులను కేటాయించినట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది కృషి వల్లే ఈ ర్యాంకు సాధ్యమైందని పేర్కొన్నారు. ఇటువంటి ర్యాంకులు ద్వారా విశ్వవిద్యాలయ కీర్తి మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకుల విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి. రవిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్ధయ్య, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎల్. ఉదయ కుమార్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ కె. మధుబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సంధ్య కోల్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. గోపీకృష్ణ పాల్గొన్నారు.

చింతల తండాలో కార్డెన్ సెర్చ్

విజయపురి సౌత్: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మాచర్ల మండలం చింతలతండాలో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నెల్లూరు ట్రాఫిక్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 40 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రదేశాల్ని గుర్తించి క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం డీఎస్పీ ఆర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రశాంతత నెలకొల్పడమే ధ్యేయమని తెలిపారు. ఎవరైనా గొడవలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామాల్లో ఏదైనా సమస్య వస్తే పోలీసుల్ని సంప్రదించాలని ఆయన కోరారు.కార్యక్రమంలో నెల్లూరు ఎస్బీ, ఎస్టీ సెల్ సీఐ ఆర్.సురేష్, ఆర్ ఐ నాగరాజు, విజయపురి సౌత్ ఎస్ఐ పట్టాభి రామయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట టౌన్: హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎన్నికల నేపథ్యంలో నియమించిన ప్రత్యేక అధికారి, శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ ఎస్పీ ఎ. సురేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కౌటింగ్ తేదీ వచ్చే నెల 4వ తేదీ వరకు పారా మిలటరీ, కేంద్ర ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తామన్నారు. ప్రజలకు మేమున్నామన్న భరోసా కల్పించటంతో పాటు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీస్ శాఖ పరంగా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అల్లర్లకు తావివ్వకుండా పోలీస్ శాఖకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎస్ఎన్. కళాశాల నుంచి ఫ్లాగ్ మార్చ్ పట్టణ అంతర్గత వీధుల్లో కొనసాగింది. కార్యక్రమంలో క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, డీఎస్పీ సుధాకరరావు, సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, రూరల్ సీఐ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఏడు వాహనాలు స్వాధీనం



నిందితుడితో జీఆర్పీ పోలీసులు

లక్ష్మీపురం: బైక్‌ల చోరీ కేసులో నిందితుడిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేసి రూ.4.20 లక్షల విలువైన ఏడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో బుధవారం సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పి.రమేష్, జి.వెంకటాద్రి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో గుంటూరు జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో అనుమానితుడిగా ఉన్న గుంటూరు రత్నగిరి కాలనీ పలకలూరుకు చెందిన వెలివోలు వెంకటేష్ పోలీసుల్ని చూసి పరుగులు తీశాడు. వారు వెంటబడి అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి, వాటిని విక్రయించగా వచ్చిన నగదుతో జల్సాలకు పాల్పడుతున్నట్లు వెంకటేష్ విచారణలో ఒప్పుకున్నాడు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఏడు ద్విచక్ర వాహనాల్ని జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.4.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జీఆర్పీ సీఐ మాట్లాడుతూ బైకులను పార్కింగ్ కౌంటర్లలో మాత్రమే పెట్టుకోవాలని సూచించారు.

మృత్యువే గెలిచింది

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి
- ఇద్దరు కొడుకులనూ కోల్పోయిన కుటుంబం
- రోడ్డు ప్రమాదం మిగిల్చిన విషాదం



మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ (ఫైల్)

తెనాలి: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తెనాలి యువకుడు మహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. సోమవారం హైదరాబాద్‌లో ద్విచక్ర వాహనం డివైడరుకు ఢీకొన్న ప్రమాదంలో దాన్ని నడుపుతున్న మహమ్మద్ హుస్సేన్ బేగ్ (19) అక్కడికక్కడే దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో గాయపడిన అతడి తమ్ముడు ఇస్మాయిల్ బేగ్‌ను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ వెంటిలేటరుపై చికిత్స అందించారు. మెరుగైన చికిత్సకోసమని హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యశాలకు తరలించినా ప్రయోజనం లేకుండాపోయింది. మహమ్మద్ హుస్సేన్ బేగ్, ఇస్మాయిల్ బేగ్ తల్లిదండ్రులు తెనాలి గాంధీనగర్‌లోని లెనిన్ వీధిలో నివసిస్తుంటారు. వీరి తండ్రి స్థానికంగా ఒక వస్త్రదుకాణంలో గుమాస్తాగా చేస్తుంటారు. మహమ్మద్ హుస్సేన్ బేగ్ డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఐటీఐ చేసిన అతడి తమ్ముడు ఇస్మాయిల్ బేగ్, హైదరాబాద్‌లోని హెచ్ఏఎల్‌లో అప్రెంటిస్‌గా చేస్తున్నాడు. ఎల్బీ నగర్ సమీపంలోని ఆదిభట్ల ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. తమ్ముడు ఇస్మాయిల్ బేగ్‌ను హెచ్ఏఎల్ వద్ద దిగబెట్టేందుకు సోమవారం ఉదయం ఇద్దరూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఉదయం 7.15 గంటల ప్రాంతంలో అమీర్‌పేట వద్ద రోడ్డు డివైడర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనటంతో ఈ ప్రమాదం జరిగింది. ఇస్మాయిల్ బేగ్ భౌతికకాయాన్ని గురువారం తెనాలి తీసుకొస్తారని తెలిసింది.

ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, లేబరేటరీలు తప్పనిసరిగా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రేషన్, హెల్త్ పర్సనల్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యంతో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌పై సమీక్ష నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు టెక్నికల్ సపోర్ట్ ఇవ్వడానికి జిల్లాకు భవ్య హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ ఎంట్రో ల్యాబ్ ఏజెన్సీ ముందుకు వచ్చాయని తెలిపారు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రి, ల్యాబ్‌ల యాజమాన్యం వారికి పూర్తి సహకారం అందించి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రక్రియలో భాగంగా హెచ్.ఎఫ్.ఆర్, హెచ్‌పీఆర్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు. జిల్లాలో ఉన్న 811 ప్రైవేట్ ఆసుపత్రులకు గాను 166 మాత్రమే రిజిస్టర్ చేయించుకున్నట్లు వెల్లడించారు. ప్రతినెలా 8, 9, 10 తేదీల్లో ఆరోగ్య కేంద్రాల్లో జరిగే పీఎంఎస్ఎ కార్యక్రమంలో రిఫర్ చేసిన గర్భిణులకు ఉచితంగా, టిఫా స్కాన్ చేయాలని ఆదేశించారు.. ప్రభుత్వం ఆయా ఆసుపత్రులకు రూ.1100, సాధారణ స్కాన్ చేస్తే రూ. 250 ఇస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్లను ప్రోత్సహించేందుకు కృషి



పవర్ లిఫ్టర్లతో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. పట్టణంలోని ఈద్గా ఆవరణలో బుధవారం రాత్రి రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 29 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్న 11వ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్-2024 పోటీల్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలుత పవర్ లిఫ్టర్ గుమ్మడి పుల్లేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు దృఢ నిశ్చయంతో అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. ప్రతిభా పాటవాల్ని మరింత మెరుగుపరచుకుంటూ ప్రభుత్వ ప్రోత్సాహంతో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ డైరెక్టర్ పారేపల్లి విజయలక్ష్మి, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రెసిడెంట్ మద్ది ప్రభాకర్, జిల్లా అసోషియేషన్ కార్యదర్శి షేక్ సంధాని పాల్గొన్నారు.

అల్లర్లుసృష్టించే వారిపై కఠిన చర్యలు

నాదెండ్ల: ఎన్నికల ఫలితాల వెలువడనున్న నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లుసృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ, చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమణమూర్తి చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో స్థానికులకు ఎన్నికల అనంతరం శాంతిభద్రతలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవ్వింపు చర్యలు, అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాజకీయ ప్రేరేపిత ఉద్రిక్తతలతో గ్రామాల్లో శాంతియుత వాతావరణాన్ని భంగం కలిగించవద్దని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ గెలుపొందినా ప్రజలు సంయమనంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ సుబ్బారావు, ఎస్ఐ జె. బలరామ్‌రెడ్డి ఉన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు

జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి. లాఠకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల జిల్లా ప్రధాన అధికారి

నరసరావుపేట: జేఎన్‌టీయూ కాలేజీలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, పకడ్బందీగా, అప్రమత్తత, కచ్చితత్వంతో వేగంగా చేసేలా పోలింగ్ సిబ్బంది పని చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ బి లాఠకర్ ఆదేశించారు. స్థానిక ఎ-1 కన్వెన్షన్ సెంటర్లో కౌంటింగ్ ప్రక్రియపై రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందికి బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలో, రిసెప్షన్ సెంటర్‌లో తప్పిదాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే సంబంధిత రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఫలితాలు సజావుగా వచ్చేలా వ్యవహరించాలని చెప్పారు. సిబ్బంది ఎక్కడా సొంత నిర్ణయాలు, ఆలోచనలు, ప్రయోగాలు చేయరాదని, ఎన్నికల నియమావళి తప్పక పాటించాలని ఆయన ఆదేశించారు. మొత్తం 15 హాళ్లలో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. అందులో ఏడు కౌంటింగ్ సెంటర్లు అసెంబ్లీ నియోజిక వర్గాలకు 14 ఈవీఎం టేబుళ్లు, రెండు పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయని వివరించారు. మాచెర్ల, సత్తెనపల్లి నియోజకవర్గానికి మూడు పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు ఉంటాయని తెలిపారు. పార్లమెంట్ నియోజిక వర్గానికి ఏడు హాళ్లలో 14 ఈవీఎం టేబుళ్లు, 18 పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లకు సంబంధించి వేరొక కౌంటింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరుకాని సిబ్బందికి ఆయా శాఖల జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కౌంటింగ్ సిబ్బంది సంబంధిత రిటర్నింగ్ అధికారి అనుమతి లేకుండా బయటకు వెళ్లకూడదని తెలిపారు. ఏజంట్లతో సమన్వయంతో, సహనంతో పనిచేయాలని ఆయన సూచించారు. ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీదేవి కౌంటింగ్ ప్రక్రియపై పీపీటీ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ అరుణ కుమార్ పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియపై వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రౌడీషీట్లు

- సెబ్ రాజమండ్రి అడిషనల్ ఎస్పీ సోమశేఖర్
- సత్తెనపల్లిలో పోలీసులు, బీఎస్ఎఫ్ సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్



సత్తెనపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న సెబ్ రాజమండ్రి అడిషనల్ ఎస్పీ సోమశేఖర్, బలగాలు

సత్తెనపల్లి: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలతో పాటు రౌడీషీట్లు తెరుస్తామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమండ్రి అడిషనల్ ఎస్పీ పి. సోమశేఖర్ తెలిపారు. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌ను పురస్కరించుకొని కొట్లాటలు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ జి.గుర్‌నాథ్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకొని బీఎస్ఎఫ్ కేంద్ర బలగాలు పెద్ద ఎత్తున దించినట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు, కవ్వింపు చర్యలు చోటు చేసుకున్నా, హింసాత్మక సంఘటనలు ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న అన్ని వ్యవస్థలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. పట్టణంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ఘర్షణలు, కొట్లాటలు జరగకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్ కింద ఎస్ఐతో పాటు కొంతమంది సిబ్బంది కూడా ఉంటారని తెలిపారు. వీరంతా వారి పరిధిలో వాగ్వివాదాలు చోటు చేసుకుంటే నివారణ చర్యలు చేపడతారని పేర్కొన్నారు. మాట వినకపోతే స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసులు నమోదు చేస్తారని చెప్పారు. గొడవలు చేసేవారు, నేరచరిత్ర కలిగిన వారిని ముందస్తుగా అరెస్ట్ చేస్తామని వెల్లడించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో 140 మందిపై రౌడీషీట్ తెరిచామని వివరించారు. ఫలితాలు వెలబడిన అనంతరం జిల్లాలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధించినట్లు తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎలాంటి ర్యాలీలు చేపట్టకూడదని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ జి గురునాథ్‌బాబు, సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు, సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం రాంబాబు, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్, పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం. సత్యనారాయణ, పోలీసులు బీఎస్ఎఫ్, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ M.S.M. Inter (V) College, Guntur 10th Pass అయిన వారికి MLT, MPHW (నర్సింగ్) Agriculture, Veterinary Course లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. 7386706839, 7386406839

PARAMEDICAL

■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225

REAL ESTATE

■ ఓనర్ కన్వర్షన్ గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్ చైతన్య స్కూల్ దగ్గరలో 115 చ॥గ॥ పడమర ఫేస్ G+1 బిల్డింగ్ & అంజనేయకాలనీ Opp: భవానీపురంలో 148 చ॥ ఉ/ఫే స్థలం అమ్మకం కలదు. 8019745977

PLOT FOR SALE

■ 22 సెంట్లు భూమి రూ. 7,50,000/- స్పాట్ రి. ఒకే పెట్టుబడి పై 3 ఆదాయాలు. అవకాడో ప్లాంటేషన్ ఫ్రీ సంవత్సరాల్లో ఆదాయం. అద్దంకి దగ్గర గుంటూరు నుండి గంట ప్రయాణం. 83175 28192

■ గుంటూరు మార్కెట్ నుండి 12 km దూరంలో చింతపల్లిపాడు గ్రామానికి అనుకొని ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్స్ 111 గజాలు (25x40) 375000/- మాత్రమే. 9492939269

TO-LET COMMERCIAL

■ గుంటూరు హరిహరమహల్ సినిమా హాల్ వెనుక ఇండియన్ బ్యాంక్‌పైన 1st ఫ్లోర్ 3000 Sft కమర్షియల్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. Ph: 9848566343

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టెక్‌టవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఐర్పులు. ✆ 9253560455

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

MARRIAGE SERVICES

■ పెళ్లి సంబంధాలు. సాఫ్ట్‌వేర్, డాక్టర్స్, NRI, గవర్నమెంట్, బిజినెస్, హై ప్రొఫైల్స్ ఫస్ట్, డైవోర్స్, విడో, లేట్ Matches సకాలంలో మంచి సర్వీస్‌తో సెట్ చేయబడును. WhatsApp: 9014842542

WANTED

■ KSR ఇన్‌ఫ్రా ప్రాజెక్టు నందు సీనియర్ అకౌంట్ (2 సం॥ అనుభవం+ ట్యాలీ) మరియు ఆఫీస్ బాయ్స్ కావలెను. అ: ఇంటర్ అపైన. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 99637 84919

■ క్యాంపస్ ఇన్‌ఛార్జీలు,క్లాసు ఇన్‌ఛార్జీలు హాస్టల్ ఇన్‌ఛార్జీలు, వార్డెన్స్‌గా పని చేయుటకు స్త్రీలు, పురుషులు కావలెను. జీతము: 10000/- నుండి 20000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనం, వసతి కల్పించబడును) విద్యార్హతలు: Inter Above, వయస్సు: 21+, పనిచేయు స్థలం: మాస్టర్‌మైండ్స్, గుంటూరు. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89781 80859

■ సిటీ జంబో జిరాక్స్ 8/1 అరండల్‌పేట గుంటూరు నందు జిరాక్స్ తీయుటకు యువతీ యువకులు, కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. గుంటూరు లోకల్‌వారు మాత్రమే. 9441065559

■ గర్ల్స్ హాస్టల్ ఇన్‌ఛార్జీలుగా పనిచేయుటకు స్త్రీలు కావలెను. జీతము: 10000/- నుండి 12000/- వరకు ఇవ్వబడును. Age: 20+. Qualification:SSC. ఉచిత భోజనం మరియు వసతి ఇవ్వబడును. Contact: 91000 24059

■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు మార్కెటింగ్ చేయుటకు MBA అర్హత గల అభ్యర్థులు కావలెను. Cont: zrexbus@gmail.com ✆ 8978396042

■ Wanted Lady Teachers Mother Teacher (Class I-III), Sci, Maths(III to VII) also wanted lady clerk. Cont:GKR HighSchool, Pattabhipuram 1st line, Gnt-6 ✆2238725, 8897882399

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్ Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్. 99632 55441

■ గుంటూరులోని ప్రముఖ ఆడ్వర్టైజ్ & ఫ్లిప్‌కార్ట్ సర్వీస్ సెంటర్, మానవ కస్టమర్ కేర్ సర్వీస్ ఆఫీసులో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్, టెలీ కాలర్స్, స్టోర్స్ మేనేజర్(M/F) కావలెను. డిగ్రీ అర్హత, సిస్టం నాలెడ్జి ఉండవలెను. మరియు గుంటూరు బాపట్ల, పల్నాడు జిల్లాలోని అన్ని మండలాల వారిగా ఫీల్డ్ వర్క్ చేయుటకు TV, వాషింగ్ మిషన్ & AC టెక్నీషియన్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. జీతం: రూ.10వేల నుండి 18వేల వరకు. అర్హత: 10th, ITI, డిగ్రీ, స్వశక్తి మీద నిలబడాలనే ఆసక్తి గల కొత్తవారికి వర్క్ నేర్పించి ఉద్యోగం కల్పించబడును. 7095855577

■ ఇంగ్లీష్ ట్రైనర్స్ & కంప్యూటర్ ఫ్యాకల్టీస్ మరియు పార్ట్ టైమ్ ట్యూటర్స్ కావలెను. ఫ్రెషర్స్‌కు ట్రైనింగ్ ఇచ్చి అపాయింట్ చెయ్యబడును. సంప్ర 4/1, బ్రాడీపేట, గుంటూరు. 8639024439

■ విజయ్ ఈ-ఫైనాన్స్ ఆఫీసు నందు పనిచేయుటకు M.S.ఆఫీసు, DTPలో అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్, తెలుగు & ఇంగ్లీషు వచ్చిన లేడీస్ స్టాఫ్ కావలెను, తెనాలి. ✆9032244425 / 9618483836

■ Wanted The YOUNG Talented TEACHERS Teach in English L.K.G to 8th Class for ALL SUBJECTS. Minimum 2 Years Experience. Send Your Resumes Before May 25th SRI SRINIVASA HIGH SCHOOL EPURUPALEM, CHIRALA ✆ 90107 33537.

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులోని లక్ష్మీపురం ఏరియాలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Male)కావలెను డ్యూటీ: 12 గం, జీతం 13000, Q: 10th Pass/Fail. ✆ 9676107661

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Q:10th to Any Degree, Sal:18000/- to 25000/- (Work from available)✆7093541752.

■ నరసరావుపేట యలమంద ఊళ్లో ప్రముఖ కంపెనీకి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ: 12గం, జీ: 10,500+ ఇన్సెంటివ్స్, రూమ్ ఫ్రీ, సబ్సిడీపై భోజన వసతి, ESI, PF. ✆ 73866 88787

■ గుంటూరు & ప్రకాశం ప్రముఖ బ్యాంకింగ్ కలెక్షన్ ఏజెన్సీలో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయుటకు ఆసక్తి గల టూ వీలర్ ఉన్న యువకులు కావలెను. Q: Int, Deg, Sal: 15,000 to 20000 ✆ 83413 20249

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18K. ఫోన్: 9160900024 / 9640400073

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్లు) ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే. ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం. ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం. ఈ పెట్టెలో ప్రకటనల కొరకు సంప్రదించండి గుంటూరు 7075167541 7075167663

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారుల తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ ఖాతాల్లో ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.